సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం । 10 । ఫిబ్రవరి । 2023



ధాన్యం పైసలెప్పుడిస్తారో ?

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి నెలదాటినా నగదు చెల్లించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. 8లో



భవిష్యత్ అవసరాల మేరకే..

భవిష్యత్ అవసరాల మేరకే మణుగూరు ఏరియాలో కొత్త గనుల ఏర్పాటుపై దృష్టి పెట్టామని సింగరేణి అధికారులు తెలిపారు. 10లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 36° / 19°

జిల్లాలో శుక్రవారం ఉష్ణోగ్రత పెరిగే అవకాశం ఉంది. రాత్రి కూడా చలి ప్రభావం అంతగా కనిపించదు.

న్యూస్‌రీల్

వైభవంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక గురువారం వైభవోపేతంగా జరిగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు నిర్వహించారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన



అమ్మవారికి సువర్ణ పుష్పార్చన చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని కేశవాపురం - జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి గురువారం 108 సువర్ణ పుష్పాలతో వైభవంగా అర్చన నిర్వహించారు. అనంతరం హారతి, మంత్రపుష్పం, నివేదన సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎన్.రజనీకుమారి, అర్చకులు, వేదపడింతులు పద్మనాభశర్మ, రవికుమార్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి టీసీసీ పరీక్షలు

కొత్తగూడెంఅర్బన్: టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సుకు సంబంధించిన లోయర్, హయ్యర్, డ్రాయింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడింగ్ పరీక్షలు ఈనెల 11 నుంచి 14 వరకు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.ఎస్.ఎస్.ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి 12.30 వరకు, మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు జిల్లా కేంద్రంలోని మూడు కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. డ్రాయింగ్, లోయర్ పరీక్షలు సింగరేణి ఉన్నత పాఠశాలలో, డ్రాయింగ్, హయ్యర్ పరీక్షలు చుంచుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, టైలరింగ్, ఎంబ్రాయిడరీ లోయర్, హయ్యర్ పరీక్షలు బాబుక్యాంప్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉంటాయని వివరించారు. మొత్తం 442 మంది అభ్యర్థులు హాజరవుతారని తెలిపారు. పరీక్ష సమయానికి గంట ముందే కేంద్రానికి చేరుకోవాలని, హాల్‌టికెట్లను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9989027943 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

నేడు ఎంపీ నామ పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: బీఆర్‌ఎస్ లోక్‌సభాపక్ష నాయకుడు, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు శుక్రవారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. ఖమ్మం, వైరా, కొత్తగూడెం నియోజకవర్గాల్లో పర్యటించనున్న ఎంపీ పలు కార్యక్రమాలకు హాజరవుతారని ఆయన క్యాంపు కార్యాలయ వర్గాలు వెల్లడించాయి.

శ్రీశైలంకు ప్రత్యేక బస్సు



ఖమ్మం మామిళ్లగూడెం: మహాశివరాత్రి సందర్భంగా శ్రీశైలం వెళ్లే భక్తుల కోసం ఖమ్మం నుండి సూపర్ లగ్జరీ సర్వీస్ ఏర్పాటుచేసినట్లు డిపో మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు. ఈనెల 17న రాత్రి 10గంటలకు బయలుదేరే ఈ బస్సు(సర్వీస్ నంబర్ 64036)లో వెళ్లేందుకు అడ్వాన్స్ రిజర్వేషన్ చేయించుకోవచ్చని పేర్కొన్నారు. ఖమ్మం నుంచి శ్రీశైలంకు చార్జీ రూ.640గా నిర్ణయించినట్లు తెలిపారు. అలాగే, ఈనెల 17, 18, 19వ తేదీల్లో ఖమ్మం కొత్త బస్టాండ్, సిటీ బస్టాండ్, కాల్వొడ్డు పాయింట్ల ద్వారా కామంచికల్ మీదుగా తీర్థాలకు 45 ప్రత్యేక సర్వీసులు నడపనున్నట్లు డీఎం వెల్లడించారు. ఈ బస్సులో పెద్దలకు రూ.30, పిల్లలకు రూ.20గా చార్జీ నిర్ణయించినట్లు తెలిపారు.

సమస్య సమసినట్టే !

తుది దశకు పోడు పట్టాల పంపిణీ ప్రక్రియ

- అర్హుల జాబితాపై జిల్లా కమిటీ కసరత్తు
- దరఖాస్తుల పునఃపరిశీలనలో అధికారులు
- జిల్లాలో 1.37 లక్షల ఎకరాలకు పట్టాలు



జూలూరుపాడు మండలంలోని అటవీ ప్రాంతంలో అధికారులను అడ్డుకుంటున్న పోడు రైతులు(ఫైల్)

చుంచుపల్లి: పోడు భూములకు హక్కు పత్రాల సమస్య త్వరలోనే పరిష్కారం కానుంది. జిల్లాలోని అనేక ప్రాంతాలకు చెందిన ఆదివాసీలు, గిరిజనులు దశాబ్దాల కాలంగా పోడు పట్టాల కోసం నిరీక్షిస్తుండగా వారి ఆశలు త్వరలోనే నెరవేరబోతున్నా యి. హక్కు ప్రతాలు పొందే అర్హుల జాబితా తయారు చేసేందుకు అధికారులు రెండు రోజులుగా తీవ్రస్థాయిలో కసరత్తు చేస్తున్నారు. జిల్లాలో వచ్చిన పోడు దరఖాస్తులపై గ్రామ, సబ్ డివిజన్ స్థాయి కమిటీల ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించి తొలుత ప్రాథమిక జాబితా సిద్ధం చేశారు. ఆ తర్వాత లిస్టును డివిజన్ కమిటీకి పంపారు. ఈ రెండు దశల్లోనూ ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉన్న దరఖాస్తులను మాత్రమే పరిగణనలోకి తీసుకుని, మిగతా వాటిని తిరస్కరించారు. డివిజనల్ కమిటీ ఆమోదం పొందిన దరఖాస్తుల ఆధారంగా జిల్లా కమిటీలో హక్కుపత్రాల పంపిణీకి అర్హులను ఎంపిక చేసేందుకు అధికారులు మరో సారి కసరత్తు చేస్తున్నారు. ఖమ్మం ఐడీఓసీ కాన్ఫరెన్ హాల్‌లో సాంఘిక సంక్షేమశాఖ కమిషనర్, ఉమ్మడి జిల్లా పోడు భూముల ప్రత్యేక అధికారి యోగితారాణా బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించి.. గ్రామసభలు, డివిజన్ కమిటీ ద్వారా ఆమోదం పొందిన దరఖాస్తులకు పోడు హక్కు పట్టాల పంపిణీకి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే డివిజనల్ స్థాయిలో ఆమోదం పొందిన దరఖాస్తులను మరోసారి పరిశీలించాలని ఆమె సూచించడంతో కలెక్టర్ అనుదీప్‌తో పాటు అటవీ, రెవెన్యూ అధికారులు గురువారం పోడు దరఖాస్తులను పరిశీలించారు. జిల్లా కమిటీకి వచ్చిన పోడు దరఖాస్తుల విషయంలో అధికారుల నుంచి కలెక్టర్ మరికొన్ని వివరాలు సేకరిస్తున్నారు. డివిజన్ కమిటీలో ఆమోదం పొందిన జాబితాను జిల్లా కమిటీలో ఏమైనా చిన్నచిన్న మార్పులు అవసరమైతే చేస్తారని, లేదంటే అదే జాబితాను ఖరారు చేస్తారని సమాచారం. రెండు రోజులుగా జిల్లా అధికార యంత్రాంగం హడావుడి చూస్తుంటే ఈ వారంలోనే అర్హులైన పోడు సాగుదారుల చేతికి హక్కు పత్రాలు అందే అవకాశం ఉన్నట్లు కనిపిస్తోంది.

1.37 లక్షల ఎకరాలకు..

పోడు భూముల సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 2021 నవంబర్‌లో సాగుదారుల నుంచి అర్జీలు తీసుకుంది. అప్పుడు జిల్లాలోని 726 గ్రామాల పరిధిలో 2,99,478 ఎకరాల పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలంటూ 82,621 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఆ దరఖాస్తుల ఆధారంగా క్షేత్రస్థాయిలో పోడు భూముల సర్వే పూర్తి చేసి గతేడాది నవంబర్‌లో అధికారులు గ్రామసభలు నిర్వహించారు. ఈ సభల్లో ఆమోదం పొందిన దరఖాస్తులను డివిజనల్ కమిటీకి సిఫార్సు చేశారు. ప్రభుత్వ నిబంధనలతో పాటు అటవీ హక్కుల చట్టానికి విరుద్ధంగా ఉన్న పోడు దరఖాస్తులను ఈ రెండు దశల్లోనూ తిరస్కరించారు. ప్రధానంగా 2005 డిసెంబర్ 13కు ముందు పోడు సాగు చేసిన వారిని మాత్రమే ప్రత్యేక పోర్టల్ ద్వారా అర్హులుగా గుర్తించారు. డివిజన్ స్థాయిలో ఆమోదించిన దరఖాస్తులను జిల్లా కమిటీ పరిశీలనకు పంపారు. డీఆర్సీ కమిటీ కూడా దాదాపు డివిజన్ కమిటీ ద్వారా వచ్చిన దరఖాస్తులకు ఆమోదం తెలిపే అవకాశం ఉందని తెలిసింది. దాని ప్రకారం జిల్లాలో 1.37 లక్షల ఎకరాల పరిధిలో 48,540 మంది దరఖాస్తుదారులు హక్కు పత్రాలు పొందేందుకు అర్హులుగా జిల్లా కమిటీ ప్రకటించనుంది. పోడుసాగుదారులకు అందించనున్న హక్కు పత్రాల నమూనాలను ఇప్పటికే ముద్రణ కోసం పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ఏదేమైనప్పటికీ జిల్లాలో పోడు భూములకు పట్టాల జారీ ప్రక్రియ చివరి అంకానికి చేరుకోవడంతో సాగుదారుల్లో హర్షాతిరేకాలు వెల్లువెత్తుతున్నాయి.

కళ్లను కాపాడుకోండి

ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు



కళ్లజోడు అందజేస్తున్న పీఓ గౌతమ్ పొట్రు

భద్రాచలం: ప్రతి ఒక్కరికీ కళ్లు ఎంతో ముఖ్యమని, వాటిని కాపాడుకునేందుకు ఎల్లవేళలా జాగ్రత్తలు పాటించాలని ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు అన్నారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో గురువారం కంటి వెలుగు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కంటి ప్రాముఖ్యతను గుర్తించినందునే ప్రభుత్వం కంటివెలుగు కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. అధికారులు, సిబ్బంది, ప్రజలు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కంటి పరీక్షల అనంతరం ప్రభుత్వమే ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేస్తోందని చెప్పారు. కంటి వెలుగు కేంద్రాల గురించి గ్రామాల్లో ప్రచారం చేయించాలని, వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్ఓ శిరీషకు సూచించారు. అనంతరం కంటివెలుగు రికార్డులు తనిఖీ చేశారు. కంటివెలుగు కేంద్రంలో పరీక్షలు చేయించుకున్న వారికి కళ్లద్దాలు అందజేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ శిరీష, కేంద్రం ఇన్‌చార్జ్ వినయ్, పీఎంఓ వినయ్‌కుమార్, సిబ్బంది సంధ్యావాణి, నాగమణి, విజయలక్ష్మి, యాకూబ్‌రెడ్డి, ఆశ వర్కర్లు రమాదేవి, పార్వతి, మలేరియా హెచ్ఈఓ కృష్ణయ్య, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

కరకగూడెం: కంటివెలుగు శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్ఓ శిరీష పిలుపునిచ్చారు. మండలంలోని చిరుమల్ల గ్రామ పంచాయతీలో కొనసాగుతున్న కంటి వెలుగు శిబి రాన్ని గురువారం ఆమె పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా వైద్య సేవలు అందించాలని సూచించారు. అనంతరం పలువురికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఆ తర్వాత పీహెచ్‌సీలో రికార్డులు తనిఖీ చేశారు. వైద్యశాలను పరిశుభ్రంగా ఉంచాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని వైద్యాధికారి మధును ఆదేశించారు. కార్యక్రమంలో పీఎంఓహెచ్ చైతన్య, ఏఎంఓ గొంది వెంకటేశ్వర్లు, కంటి వెలుగు వైద్యులు బైరిశెట్టి దుర్గానరేష్, డాక్టర్ సంజీవరావు, సర్పంచ్ పాయం నరసింహారావు, ఆశ్రమ పాఠశాల హెచ్ఎం జగన్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లోనూ 'లోక్ అదాలత్'

ఖమ్మంలీగల్: రోడ్డు ప్రమాద బాధితులు లోక్ అదాలత్ ఎదుట హాజరుకాలేని పక్షంలో ఆన్‌లైన్‌లో విచారించి అవార్డు జారీ చేస్తామని ఖమ్మం జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ టి.శ్రీనివాసరావు తెలిపారు. న్యాయ సేవా సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ మహ్మద్ అబ్దుల్ జావేద్ పాషాతో కలిసి గురువారం ఆయన రోడ్డు రవాణా సంస్థపై దాఖలైన నష్టపరిహారం కేసులను పరిష్కరించారు. ఈ సందర్భంగా ఓ న్యాయవాది తమ కేసులో బాధితుడు లేవలేని పరిస్థితిలో ఉన్నాడని న్యాయమూర్తి దృష్టికి తీసుకురాగా, ఆన్‌లైన్‌లో పరిశీలించడమే కాక కేసు పరిష్కరించి అవార్డు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, డాక్టర్ గిరిసింహారావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేయాలి

గవర్నర్‌కు రెడ్‌క్రాస్ బాధ్యుల వినతి



సమావేశంలో మాట్లాడుతున్న కాంతారావు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని సూపర్ స్పెషాలిటీ మెడికల్ ఇన్‌స్టిట్యూట్‌గా అప్‌గ్రేడ్ చేయాలని ఇండియన్ రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎల్.కాంతారావు కోరారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్ రాజ్‌భవన్‌లో గిరిజన ప్రాంతాల్లో వైద్యసేవల అభివృద్ధి, బడ్జెట్‌లో వైద్యరంగానికి కేటాయింపులు అంశంపై దర్బార్ నిర్వహించారు. ఈ సమావేశంలో గవర్నర్, రెడ్‌క్రాస్ రాష్ట్ర అధ్యక్షురాలు తమిళిసై పాల్గొనగా కాంతారావు మాట్లాడారు. భద్రాచలం ఏరియా ఆస్పత్రి 200 పడకల సామర్థ్యం ఉండగా, తెలంగాణ, ఏపీ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ నుంచి ప్రజలు వైద్యం కోసం వస్తుంటారని తెలిపారు. ఈ ఆస్పత్రిని సూపర్ స్పెషాలిటీ మెడికల్ ఇన్‌స్టిట్యూట్‌గా అప్‌గ్రేడ్ చేసి కొత్తగూడెంలోని మెడికల్ కాలేజీకి అనుసంధానం చేస్తే పేదలకు మెరుగైన వైద్యం అందుతుందని చెప్పారు. ఈ సమావేశంలో రెడ్‌క్రాస్ రాష్ట్ర కార్యదర్శి కె.మధుసూదన్‌రావుతో పాటు డాక్టర్ విజయ్‌చంద్రారెడ్డి, వై.సూర్యనారాయణ, జి.రాజారెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

బాగుపడింది కేసీఆర్ కుటుంబమే..

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి గోపాల్‌రెడ్డి
- రేవంత్ పాదయాత్ర, బస ఏర్పాట్ల పరిశీలన



మాట్లాడుతున్న విజయరమణారావు, రాంరెడ్డి గోపాల్‌రెడ్డి

ఇల్లెందు: బంగారు తెలంగాణలో సీఎం కేసీఆర్ కుటుబమే బాగుపడిందని, పేదలకు ఒరిగిందేమి లేదని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి గోపాల్ రెడ్డి, రేవంత్‌రెడ్డి పాదయాత్ర మహబూబాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ విజయరమణారావు విమర్శించారు. గురువారం ఇల్లెందులో వారు విలేకరులతో మాట్లాడారు. ఈనెల 6న మేడారంలో ప్రారంభమైన రేవంత్‌రెడ్డి పాదయాత్ర ఇల్లెందు నియోజకవర్గంలో రెండు రోజుల పాటు సాగుతుందని తెలిపారు. రెండు కార్నర్ మీటింగ్‌లు ఉంటాయన్నారు. రాష్ట్రంలో రాక్షస ప్రభుత్వం రాజ్యం ఏలుతోందని, పేదలకు పాలకులు అందుబాటులో లేకుండా పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. పెత్తందారుల పాలన సాగుతోందన్నారు. నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగాయని, ఇక కేంద్ర ప్రభుత్వం సైతం గ్యాస్, పెట్రోల్ ధరలు కూడా విపరీతంగా పెంచాయని విమర్శించారు. విద్యుత్ ధరలు పెంచి పేదలను అతలాతకుతలం చేస్తున్నారని అన్నారు. ఇష్టారాజ్యంగా కరెంట్ కోతలు విధిస్తున్నారని, ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో ఏఈ, డీఈలకే తెలియడం లేదని ఎద్దేవా చేశారు. ఇలాంటి తరుణంలో అసెంబ్లీలో మంత్రి హరీష్‌రావు 24 గంటలు విద్యుత్ ఇస్తున్నట్లు ప్రకటించటం దుర్మార్గమన్నారు. పేదల రాజ్యం కాంగ్రెస్‌తోనే సాధ్యమని, అందు కోసమే రేవంత్ రెడ్డి పాదయాత్ర చేస్తున్నారని తెలిపారు. శుక్రవారం కామేపల్లిలో పలు గ్రామాల్లో పాదయాత్ర కొనసాగుతుందని చెప్పారు. శనివారం ఇల్లెందులో పార్టీ కార్యకర్తలు, నాయకులు, ప్రజా సంఘాలు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో పాటు మీడియా సమావేశంలో రేవంత్‌రెడ్డి మాట్లాడుతారని వివరించారు. అదేరోజు సాయంత్రం పట్టణంలోని జగదాంబా సెంటర్‌లో కార్నర్ మీటింగ్ ఉంటుందని తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ పట్టణ, మండల అధ్యక్షులు దొడ్డా డానియేల్, పులి సైదులు, నాయకులు లక్కినేని సురేందర్, చీమల వెంకటేశ్వర్లు, భూక్యా దళ్‌సింగ్ నాయక్, డాక్టర్ జి.రవి, గుండెబోయిన నాగమణి, బి.రాంచందర నాయక్, శంకర్ నాయక్ పాల్గొన్నారు.

ఆత్మీయ పలకరింపు!



కరచాలనం చేసుకుంటున్న పొంగులేటి, తుమ్మల

నేలకొండపల్లి: జిల్లాలో ఇటీవల జరుగుతున్న రాజకీయ పరిణామాలు రాష్ట్రంలోనే హాట్ టాపిక్‌గా మారాయి. మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి బీఆర్‌ఎస్ అధిష్ఠానంపై తిరుగుబాటు బావుటా ఎగురవేయగా.. ఆ పార్టీ నాయకులు ఆయనపై విమర్శలు ఎక్కుపెడుతున్నారు. ఈనేపథ్యాన నేలకొండపల్లి మండలం బుద్దారంలో గురువారం జరిగిన ఓ వేడుకలో పొంగులేటి, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఎదురుపడ్డారు. సర్పంచ్ శిరీష కుమారుడి రిసెప్షన్‌కు హాజరైన పొంగులేటి వధూవరులను ఆశీర్వదించి వెళ్తుండగా వేదిక వద్దకు వస్తున్న తుమ్మల ఎదురుపడ్డారు. దీంతో ఇరువురు కరచాలనం చేసుకుని చిరునవ్వుతో పలకరించుకున్నారు. ఈసందర్భంగా ఇరువురి అనుచరులు జై పొంగులేటి, జై తుమ్మల అంటూ నినాదాలు చేయడం విశేషం.

'ఇంటిగ్రేటెడ్' ఇంకెన్నాళ్లో..?

- ఇల్లెందులో ప్రారంభం కాని మార్కెట్ పనులు
- మిగతా మున్సిపాలిటీల్లోనూ జాప్యమే
- మార్చి 31లోగా పూర్తి చేయాలంటున్న ప్రభుత్వం
- వచ్చే మార్చి నాటికి కూడా సందేహమే..



ఇల్లెందులో స్థలాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్, అధికారులు

ఇల్లెందు: జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో చేపడుతున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు ఇంకా పునాది దశలోనే ఉన్నాయి. కొత్తగూడెం, పాల్వంచ, మణుగూరు, ఇల్లెందు పట్టణాల్లో ఒక్కో మార్కెట్ నిర్మాణానికి రూ.4.50కోట్లు కేటాయించారు. ఈ నిధులతో ఒక్కో మున్సిపాల్టీల్లో 120 స్టాళ్ల చొప్పున నిర్మించేలా ప్రణాళిక రూపొందించారు. కింది వరుసలో 60, పై అంతస్తులో 60 గదులు ఉండేలా డిజైన్ చేశారు. వీటితో పాటు మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్ సౌకర్యం, పార్కింగ్, కోల్డ్ స్టోరేజీలు కూడా నిర్మించాల్సి ఉంటుంది. ప్రతి రోజూ ధరలను వినియోగదారులకు తెలియజేసేలా ఎల్ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేయాల్సి ఉంది.

స్థలాల ఎంపికలో కుస్తీ..

రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్లు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం గతేడాది నిర్ణయించింది. ఇందుకు ఫైనాన్స్ కమిషన్ గ్రాంట్‌కు రాష్ట్ర మ్యాచింగ్ గ్రాంట్ జమ చేసి 129 మున్సిపాల్టీలు, 12 కార్పొరేషన్లలో సుమారు రూ.500 కోట్లతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులకు శ్రీకారం చుట్టింది. అయితే ఇప్పటికే 10 మార్కెట్ల నిర్మాణం పూర్తయింది. ఒక్కో మార్కెట్‌కు రూ.4.50 కోట్ల నిధులు కేటాయించారు. 2011 జనాభా లెక్కల ప్రకారం 25 వేల జనాభా గల మున్సిపాల్టీల్లో ఎకరం స్థలం, 25వేల పైబడి జనాభా ఉన్న మున్సిపాల్టీల్లో రెండెకరాల స్థలంలో ఈ మార్కెట్లు నిర్మించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలకు రెండెకరాల చొప్పున స్థలం కేటాయించారు. అయితే మొదట స్థలం ఎంపికలోనే జాప్యం జరిగింది. ముఖ్యంగా ఇల్లెందులో స్థలం అందుబాటులో లేకపోవడం, పాత మార్కెట్ ఉన్న స్థలంలో ఇప్పటికే మోడల్ మార్కెట్ నిర్మిస్తుండడంతో స్థల సేకరణ ఆలస్యమైంది.

పునాదులు దాటలే..

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ల నిర్మాణ పనులు ఇంకా పునాదులే దాటలేదు. ఇల్లెందులో అయితే ఇంకా పనులు ప్రారంభమే కాలేదు. జేకే ఏరియాలోని ఆంజనేయ స్వామి ఆలయం సంజయ్‌నగర్‌కు వెళ్లే రహదారి వద్ద ఈ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం చేపట్టనున్నారు. ఇందుకోసం సింగరేణి నాలుగెకరాల భూమి కేటాయించింది. ఇక్కడి కార్మికుల నివాస క్వార్టర్లను తొలిగించి స్థలం అప్పగించారు. అది కూడా రెండు నెలలు కావస్తున్నా పనులు ప్రారంభం కాకపోవడం గమనార్హం. అయితే రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల్లో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు మార్చి 31 నాటికి పనులు పూర్తి చేయాలని ఇటీవల మంత్రి కేటీఆర్ అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే. జిల్లాలో ఇల్లెందు మినహా మిగిలిన మున్సిపాలిటీల్లో పనులు ప్రారంభమైనా.. మార్చి 31 నాటికి పూర్తి కావడం సందేహమే.

స్థలం ఎంపికలో జాప్యం

ఇల్లెందు మున్సిపాలిటీకి ఇంటిగ్రేటెడ్ మార్కెట్ మంజూరై నిధులు అకౌంట్‌లో జమ అయినా స్థలం ఎంపికలో జాప్యంతో ఇంకా పనులు ప్రారంభం కాలేదు. జేకే ఏరియాలో సింగరేణి స్థలాన్ని ఇటీవలే అప్పగించారు. త్వరలోనే పనులు ప్రారంభించి నిర్ణీత కాలంలో పూర్తి చేస్తాం.

– దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, ఇల్లెందు మున్సిపల్ చైర్మన్

శంకుస్థాపనకు ఏర్పాట్లు చేస్తున్నాం

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి ఈనెల 10న మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా శంకుస్థాపన చేసేలా ఏర్పాట్లు చేస్తున్నాం. శంకుస్థాపన పూర్తి కాగానే పనులు ప్రారంభించి త్వరగా పూర్తయ్యేలా చూస్తాం.

–అంకుషావలి, మున్సిపల్ కమిషనర్

అన్నీ పునాదుల దశలోనే..

జిల్లాలో నాలుగు మున్సిపాల్టీలోనూ స్థలాల ఎంపికలో జాప్యం కారణంగా ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు ఆలస్యమయ్యాయి. అంతటా ఒకే మోడల్‌లో నిర్మాణం ఉంటుంది. అంచనా రూపొందించడంలో ఎలాంటి లోపం లేదు. ఇప్పటికే కొత్తగూడెం, పాలవ్యంచ, మణుగూరులో పునాదులు, లెంటల్ లెవల్ వరకు పనుల జరిగాయి. ఇక ఇల్లెందులో మాత్రం పనులు ప్రారంభం కావాల్సి ఉంది. త్వరలో శంకుస్థాపన జరగనుంది.

– శ్రీనివాసరావు, పబ్లిక్ అండ్ హెల్త్ డీఈ

డీవీకే వ్యతిరేకం.. ఎమ్మెల్యేకు కాదు



మాట్లాడుతున్న కౌన్సిలర్ మాధవి, ఆమె భర్త రవితేజ

ఇల్లెందు: మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు అనుసరిస్తున్న ఒంటెద్దు పోకడలకు వ్యతిరేకంగా మాత్రమే తాము పోరాడుతున్నామని 7వ వార్డు కౌన్సిలర్ సామల మాధవి, ఆమె భర్త సామల రవితేజ తెలిపారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. గత ఏడాది కాలంగా బాధలు అనుభవిస్తున్నామని, ఈ వ్యతిరేకత ఇప్పటికిప్పుడే వచ్చింది కాదని చెప్పారు. తమకు జరుగుతున్న అన్యాయాన్ని మహిళా కౌన్సిలర్లు పెద్దల దృష్టికి తెచ్చినా.. పరిస్థితిలో మార్పు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ తరుణంలో తప్పనిసరై అవిశ్వాస నోటీసు అందజేశామన్నారు. అయితే తమను అమ్ముడుబోయిన కౌన్సిలర్లుగా చిత్రీకరించారని అన్నారు. తాము డీవీకి వ్యతిరేకంగా మాత్రమే పోరాడుతున్నామని, ఎమ్మెల్యేకు, పార్టీకి వ్యతిరేకం కాదన్నారు. ఈ విషయాన్ని పట్టణ ప్రజలు గమనించాలని కోరారు.

ప్రలోభపెట్టారు..

కాగా, అవిశ్వాసానికి అనుకూలంగా ఉంటే తమకు రూ.5 లక్షలు ఇస్తామంటూ ప్రలోభపెట్టారని 5వ వార్డు కౌన్సిలర్ వీణ, ఆమె భర్త వాసు చెప్పారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. తమను ప్రలోభాలకు గురి చేసిన వారే ఇప్పుడు మాట మారుస్తున్నారని, తమ ముందుకు వస్తే వాస్తవాలు నిరూపిస్తామని సవాల్ విసిరారు. ఇల్లెందు మున్సిపాలిటీని అభాసుపాలు చేయవద్దని హితవు పలికారు.

క్లుప్తంగా

జేఈఈలో ప్రభుత్వ కళాశాల విద్యార్థుల ప్రతిభ


కొండ సాయితేజ


యువ శ్రీకృష్ణసాయి


బొందిలి మురళీకృష్ణ

దుమ్ముగూడెం: జేఈఈ ఫలితాల్లో దుమ్ముగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్మీడియట్ విద్యార్థులు సత్తాచాటారు. కొండ సాయితేజ 78.5, మండలోజు యువ శ్రీకృష్ణ సాయి 70.6, బొందిలి మురళీకృష్ణ 59.6 పర్సంటైల్‌తో ప్రతిభ కనబరిచారు. ప్రతిభచూపిన విద్యార్థులను గురువారం కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.వెంకటేశ్వర్లు, అధ్యాపకులు అభినందించారు. ప్రభుత్వ కళాశాలలో కార్పొరేట్ స్థాయిలో విద్య అందిస్తున్నామని, ఇదే స్ఫూర్తితో మిగతా విద్యార్థులు కూడా రాణించాలని సూచించారు.

ఏప్రిల్ నుంచి పెరిగిన వేతనాలు..


మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ

మణుగూరుటౌన్: మున్సిపల్ కార్మికులకు ఏప్రిల్ నుంచి పెరిగిన వేతనాలు చెల్లించాలని కలెక్టర్ అనుదీప్ ఆదేశించారని మణుగూరు మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన వివరాలు వెల్లడించారు. పెంచిన వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ కార్మికులు మూడు రోజులుగా సమ్మె చేస్తున్నారు. ఈ విషయాన్ని కమిషనర్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా.. ఏప్రిల్ నుంచి జీఓ ప్రకారం రూ.15,600 వేతనం చెల్లించాలని ఆదేశించారని తెలిపారు. కార్మికులు సమ్మె విరమించి పనులు చేపట్టాలని సూచించినట్లు పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ ఢీకొని యువకుడి మృతి


ప్రమాద స్థలంలో వేణు మృతదేహం

టేకులపల్లి: ఇసుక ట్రాక్టర్ ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. టేకులపల్లి ఎస్‌ఐ భూక్య శ్రీనివాస్ నాయక్ కథనం ప్రకారం.. సింగరేణి మండలం పోలంపల్లి పంచాయతీ మోకాళ్లగుంపు గ్రామానికి చెందిన ఆరెం వేణు(20) టేకులపల్లి మండలం తడికలపూడిలో తన పెద్దనాన్న ఇంటికి మూడు రోజుల క్రితం వచ్చాడు. బుధవారం రాత్రి తన బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరాడు. తడికలపూడి రోడ్డులో కల్వర్టు వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న ఇసుక ట్రాక్టర్ ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందిన పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు. గురువారం పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ట్రాక్టర్ డ్రైవర్ గుగులోత్ సైదులుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

అశ్వారావుపేటరూరల్: ఓ భవనంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా గురువారం అగ్ని ప్రమాదం జరిగింది. బాధితుడి కథనం ప్రకారం.. మండల పరిధిలోని గుర్రాల చెరువు గ్రామానికి చెందిన చుండ్రు దుర్గారావు, కుటుంబ సభ్యులు కలిసి వ్యవసాయ పనుల కోసం బయటకు వెళ్లారు. తిరిగి ఇంటి వచ్చేసరికి భవనంలోగల ఓ గదిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించి బీరువా, ఫ్రిజ్, దుస్తులు, మంచాలు, రూ.50 వేల నగదు, బంగారం ఆభరణాలు పూర్తిగా కాలిపోయాయి. దాదాపు రూ. 2 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు.

ద్విచక్ర వాహనం చోరీ

భద్రాచలంఅర్బన్: ద్విచక్ర వాహనం చోరీపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని అశోక్‌నగర్ కాలనీకి చెందిన సంజయ్ బుధవారం రాత్రి తన ఇంటి ముందు ద్విచక్ర వాహనాన్ని పార్కింగ్ చేశాడు. ఉదయాన్నే నిద్ర లేచి చూడగా సదరు బైక్ చోరీకి గురైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మధుప్రసాద్ తెలిపారు.

సీబీఐ అధికారినంటూ టోకరా

కొత్తగూడెంఅర్బన్: సీబీఐ అధికారిగా పరిచయం చేసుకున్న మహిళ బంగారు గొలుసు తీసుకుని చెల్లని చెక్కు ఇచ్చిన ఘటనపై కేసు నమోదైంది. త్రీటౌన్ పోలీసుల కథనం ప్రకారం.. కొత్తగూడెం సఫాయి బస్తీలోని కేపీకే జ్యూయలర్స్‌కు కొత్తగూడెంనకు చెందిన బానోత్ సరిత బుధవారం వచ్చింది. తాను సీబీఐలో విధులు నిర్వర్తిస్తున్నట్లు పరిచయం చేసుకుని రూ.75వేల విలువైన బంగారు గొలుసు తీసుకుంది. తొలుత గూగుల్ పేతో నగదు చెల్లిస్తానని చెప్పి, ఆతర్వాత యాప్ పని చేయడం చెప్పి చెక్కు ఇచ్చి వెళ్లిపోయింది. యజమాని కృష్ణయ్యనాయుడు గురువారం బ్యాంకుకు వెళ్లగా చెక్కు చెల్లదని చెప్పడంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ధాన్యం పైసలెప్పుడిస్తారో..?

- నెల రోజులు గడిచినా అందని నగదు
- ఇంకా రూ.20.93 కోట్లు పెండింగ్
- రబీ పెట్టుబడికి రైతుల ఇక్కట్లు


మల్లెలమడుగులో ధాన్యం కాంటాలు పెడుతున్న హమాలీలు (ఫైల్)

అశ్వాపురం: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి నెల రోజులు గడిచినా నగదు చెల్లించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రైతులు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చిన 24 గంటల్లో కొనుగోలు చేసి 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బు జమచేస్తామని ప్రభుత్వం, అధికారులు చెప్పినా ఆచరణలో అమలు కావడంలేదు.

రూ.20.93 కోట్లు పెండింగ్

పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో 154 ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రూ.239.17 కోట్లతో 17,094 మంది రైతుల నుంచి 1,16,991.400 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. 16,259 మంది రైతులకు సంబంధించిన 1,06,779.62 మెట్రిక్ టన్నుల ధాన్యానికి రూ.218.24 కోట్లు చెల్లించారు. ఇంకా 835 మంది రైతులకు 10,211.78 మెట్రిక్ టన్నుల ధాన్యానికి రూ.20.93 కోట్లు డబ్బులు చెల్లించాల్సి ఉంది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి నెల రోజులు గడిచినా డబ్బులు రైతుల ఖాతాలో జమ కాకపోవడంతో జిల్లా వ్యాప్తంగా 835 మంది రైతులు ధాన్యం డబ్బులు ఖాతాలో జమ అయ్యాయా లేదా అని బ్యాంక్‌లు, కొనుగోలు కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు.

సాగు ఖర్చుల కోసం ఇక్కట్లు..

ధాన్యం విక్రయించి నెల రోజులు గడిచినా డబ్బులు రావడం లేదని రైతులు వాపోతున్నారు. అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టామని , దీంతో అప్పులు చెల్లించాలని తమపై తీవ్ర ఒత్తిళ్లు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ప్రభుత్వం ధాన్యం విక్రయించిన నగదు చెల్లించకుండా జాప్యం చేస్తోందని ఆరోపించారు. వరికోత యంత్రాలకు, కౌలు డబ్బులు, హమాలీ చార్జీలు, పరదాల డబ్బులు చెల్లించాల్సి ఉందని పేర్కొంటున్నారు. రబీ సీజన్ ప్రారంభంకావడంతో ఎరువులు, పెట్టుబడులు కోసం ఇక్కట్లు తప్పడం లేదని, ప్రభుత్వం స్పందించి ధాన్యం డబ్బులు వెంటనే చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

నెల రోజులైనా నగదు రాలే..



మల్లెలమడుగు ధాన్యం కొనుగోలు కేంద్రంలో గత నెల 12న నాతో పాటు మరో రైతు ధాన్యం 940 బస్తాల ధాన్యం మిల్లుకు తరలించారు. నెల రోజులైనా డబ్బులు రావడం లేదు. సాగు ఖర్చులు, రబీ సాగు పెట్టుబడికి డబ్బులు లేక ఇబ్బంది పడుతున్నాం. అధికారులు స్పందించి ధాన్యం డబ్బులు వెంటనే చెల్లించాలి.

– రాగం మల్లయ్య, రైతు, మల్లెలమడుగు, అశ్వాపురం మండలం

ఐదు రోజుల్లో జమ..

జిల్లాలో 16,259 మంది రైతుల నుంచి కొనుగోలు చేసిన 1,06,779.62మెట్రిక్ టన్నుల ధాన్యానికి రూ.218.24 కోట్లు చెల్లించాం. ఇంకా 835 మంది రైతులకు రూ.20.93 కోట్లు చెల్లించాల్సి ఉంది. నాలుగు, ఐదు రోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయి.

–త్రినాథ్‌బాబు, పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజర్

విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలి


మాట్లాడుతున్న డీఎస్పీ రెహమాన్

కొత్తగూడెంఅర్బన్: విద్యార్థులు కష్టపడి చదువుతూ ఉన్నతస్థాయికి ఎదగాలని డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ సూచించారు. గురువారం ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ (ఎల్టా) జిల్లా కమిటీ, జిల్లా విద్యా శాఖ సంయుక్త ఆధ్వర్యంలో కొత్తగూడెం సింగరేణి పాఠశాలలో జిల్లా స్థాయి స్పెల్ విజార్డ్, స్టోరీ టెల్లింగ్ పోటీ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఇంగ్లిష్ భాషతోపాటు అన్ని సబ్జెక్టుల్లో కూడా విషయ పరిజ్ఞానం పెంపొందించుకోవాలని సూచించారు. సైబర్ నేరాలు బాగా జరుగుతున్న ఈ రోజుల్లో జాగ్రత్తగా ఉండాలని, విద్యార్థులు సెల్ ఫోన్‌లకు దూరంగా ఉండాలని ఉద్బోధించారు. విశ్వజ్ఞాన సముపార్జన చేసుకుంటూనే విద్యార్థులను తరగతి గదిలో ఉన్నత స్థాయికి తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయుల పాత్ర గొప్పదని అన్నారు. కాగా, విజార్డ్ పోటీలో మామిళ్లగూడెం పాఠశాలకు చెందిన రవళి రాష్ట్రస్థాయికి ఎంపికైంది. ద్వితీయస్థానంలో అశ్వారావుపేట మండలానికి చెందిన కె.భువన్‌కిశోర్, స్టోరీ టెల్లింగ్‌లో పోటీలతో అన్నపురెడ్డి పల్లికి చెందిన ఏ.ఆశ ప్రథమ, గుమ్మడిపల్లి పాఠశాలకు చెందిన డి. చందన ద్వితీయ బహుమతి సాధించారు. విజేతలతోపాటు పోటీలో పాల్గొన్న 70 మంది విద్యార్థులకు ప్రశంస పత్రాలతోపాటు జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరీక్షల అధికారి ఎస్.మాధవరావు, వన్‌టౌన్ సీఐ బత్తుల సత్యనారాయణ, జిల్లా విద్యా శాఖ ఏఎంఓ రాజ శేఖర్, ఎల్టా జిల్లా ప్రెసిడెంట్ షేక్ దస్తగిరి, కోశాధికారి జహంగీర్ షరీఫ్, రాష్ట్ర కౌన్సిలర్ కైసర్ బేగం, వైద్యులు మహమూద్ పాషా, న్యాయ నిర్ణేతలుగా రమాదేవి, జానకీ దేవీ, తావుర్య, రాంచందర్ రావు, హరిబాబు, జయదాస్, సునీత, వెంకన్న, ప్రేమ్‌కుమార్, మురళీధర్, ప్రశాంత్, సింగరేణి హెచ్‌ఎం సాయి సుజాత తదితరులు పాల్గొన్నారు.

రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

కొత్తగూడెంటౌన్: రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని, ప్రజా జీవితానికి ఆటంకం కలగకుండా నడుచుకోవాలని కొత్తగూడెం డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్ సూచించారు. గురువారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. రాబోయే ఎన్నికల్లో ఎలాంటి గొడవలకు దిగిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

‘కొమరారం’ మండలం ఏర్పాటు చేయాలి


దీక్షకు సంఘీభావం తెలుపుతున్న జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య

జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య

ఇల్లెందురూరల్: కొమరారంను మండల కేంద్రంగా ప్రకటించాలనే స్థానికుల డిమాండ్ న్యాయసమ్మతమైనదని జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య పేర్కొన్నారు. నూతన మండలం ఏర్పాటు కోసం కొమరారం గ్రామంలో ప్రజాపంథా ఆధ్వర్యంలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు తొమ్మిదో రోజుకు చేరాయి. దీక్షలకు గురువారం జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలోనే కొమరారంను మండల కేంద్రంగా ప్రకటించాలని కోరామని తెలిపారు. సాధ్యాసాధ్యాలపై ప్రభుత్వం సర్వే కూడా చేసిందని గుర్తుచేశారు. ప్రస్తుతం ప్రజల నుంచి ఆకాంక్ష బలంగా ఉన్న తరుణంలో ప్రభుత్వం ఆ దిశగా ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ప్రజాపంథా కార్యకర్తలు కొమరారం, పోలారం, మర్రిగూడెం గ్రామ పంచాయతీల్లో బైక్‌ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, సర్పంచ్‌లు కృష్ణవేణి, చీమల వెంకటేశ్వర్లు, పాయం స్వాతి, ఎంపీటీసీ అజ్మీర బిచ్చా, పీఏసీఎస్ చైర్మన్ మెట్టెల కృష్ణ, ప్రజాపంథా నాయకులు పాల్గొన్నారు.

వివాహం రోజే కల్యాణలక్ష్మి చెక్కులివ్వాలి

ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ


అసెంబ్లీలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ

ఇల్లెందురూరల్: వివాహం జరిగిన రోజే కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు లబ్ధిదారులకు అందించాలని ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ కోరారు. గురువారం శాసనసభలో ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి సీఎం కేసీఆర్ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ ద్వారా 12,19,045 మందికి చేయూతనివ్వడం గర్వకారణమని పేర్కొన్నారు. దీనిపై మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ.. ఆ దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

విద్యుత్ సంస్థల దోపిడీపై పోరాడాలి

మావోయిస్టు పార్టీ బీకే ఏఎస్‌ఆర్ డివిజన్ కమిటీ కార్యదర్శి ఆజాద్

చర్ల: విద్యుత్ సంస్థల దోపిడీపై ప్రజలు పోరాడాలని మావోయిస్టు పార్టీ పిలుపునిచ్చింది. ఈ మేరకు పార్టీ భద్రాద్రి కొత్తగూడెం–అల్లూరి సీతారామరాజు జిల్లాల డివిజన్ కమిటీ కార్యదర్శి ఆజాద్ పేరిట గురువారం ఒక లేఖ విడుదలయ్యింది. లేఖలోని వివరాల ప్రకారం.. ఏసీడీ చార్జీల పేరుతో చేస్తున్న దోపిడీని ప్రభుత్వం విరమించుకోవాలని, వ్యవసాయ రంగానికి 24 గంటల విద్యుత్ సరఫరా చేయాలని ఆజాద్ డిమాండ్ చేశారు. ప్రజలకు చేయూతనిచ్చే బాధ్యత నుంచి తప్పుకుని, ప్రజలపై భారం వేసి పాలన సాగించే ఒరవడిలో ఈ ప్రభుత్వం ఉందని ఆయన ఎద్దేవా చేశారు. ప్రజలపై బలవంతంగా ఏదో ఒక రూపంలో పన్నులు వేస్తూ అడ్డగోలు వసూళ్లను సాగిస్తూ సామాన్య ప్రజలు బతకలేని విధంగా ఈ ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో ఇప్పటికే పెంచిన విద్యుత్‌చార్జీల మూలంగా ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతూ ఉంటే మళ్లీ ఏసీడీ చార్జీల పేరిట అదనపు భారం సరికాదని పేర్కొన్నారు. వ్యవసాయ రంగానికి 24 గంటలు విద్యుత్ ఇస్తున్నామని ప్రభుత్వం చెబుతోందని, కానీ కరెంటు ఎప్పుడు వస్తుందో? ఎప్పుడు పోతుందో అర్థంకాక రైతులు తలలు పట్టుకుంటున్నారని అన్నారు.

ఆర్టీసీ బస్సులో ప్రయాణించిన డీఎం


ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న డీఎం వెంకటేశ్వర రావు

చుంచుపల్లి: బస్ డే లో భాగంగా గురువారం కొత్తగూడెం ఆర్టీసీ డిపో మేనేజర్ బాణాల వెంకటేశ్వర రావు కొత్తగూడెం నుంచి ఇల్లెందుకు, ఇల్లెందు నుంచి కొత్తగూడెం వరకు ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. ఈ సందర్భంగా ఆయన డ్యూటీలో ఉన్న కండక్టర్, డ్రైవర్‌తో పాటు ప్రయాణికులతో మాట్లాడారు. ఆర్టీసీ బస్సులో అతి తక్కువ చార్జీలతో ప్రమాదాలు జరగకుండా క్షేమంగా గమ్యం చేరుకోవచ్చని తెలిపారు. సిబ్బంది ఇసనపల్లి శామ్యూల్, ఇల్లెందు బస్టాండ్ ఇన్‌చార్జి నాగరాజు, ఎ. వెంకటేశ్వర్లు ఉన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

కొత్తగూడెంటౌన్: కేసు విషయంలో శిక్ష పడుతుందేమోనని భయంతో కొత్తగూడెం రామాటాకీస్ ఏరియాకు చెందిన ఓ వ్యక్తి గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ కథనం ప్రకారం.. ఆరవ కృష్ణ (60) అనే వ్యక్తి రామాటాకీస్ ఏరియా ప్రాంతంలో వెల్డింగ్(స్క్రాప్) షాపును నిర్వహిస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. 2018 ఏడాదికి సంబంధించిన ఓ కేసు ప్రస్తుతం ట్రయల్‌కు రాగా శిక్ష పడుతుందేమోననే భయంతో ఉదయం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి భార్య సావిత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

పెట్రోల్ బంక్‌కు శంకుస్థాపన


శంకుస్థాపన కార్యక్రమానికి హాజరైన పోలీస్ అధికారులు

ఇల్లెందు: పట్టణంలోని పాత పోలీస్ స్టేషన్ ఆవరణలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో నిర్మాణం చేపట్టనున్న పెట్రోల్ బంక్‌కు డీఎస్పీ ఎస్వీ రమణమూర్తి, ఏఆర్ డీఎస్పీ సాయిబాబా గురువారం శంకుస్థాపన చేశారు. భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐ బి.రాజు, ఎస్‌ఐ రాజేష్, చంద్రశేఖర్, పోలీస్ వెల్ఫేర్ ఆర్‌ఐ కామరాజు తదితరులు పాల్గొన్నారు.

నలుగురు మైనర్లపై పోక్సో కేసు

పాల్వంచరూరల్: నలుగురు మైనర్లపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. మండల పరిధిలోని ఓ గ్రామంలో మైనర్ బాలికను మైనర్ బాలుడు చేతులు కట్టి గదిలో బంధించాడు. కాగా బాలిక చాకచక్యంగా తప్పించుకుని వచ్చి తల్లిదండ్రులకు విషయం చెప్పింది. గురువారం బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్‌ఐ సంఘటనా స్థలాన్ని పరిశీలించి, విచారణ చేపట్టారు. బాలికను బంధించిన బాలుడితోపాటు సహకరించిన మరో ముగ్గురు బాలురపై కూడా పోక్సో కేసు నమోదు చేశారు.

- **ఘర్షణలో ఆరుగురిపై..**

పాల్వంచరూరల్: ఘర్షణ వ్యవహారంలో ఇరువర్గాలకు చెందిన ఆరుగురిపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. మండల పరిధిలోని జగన్నాథపురం గ్రామంలో ఎదురెదురుగా ఉన్న రెండు ఇళ్ల మధ్య ఘర్షణ జరిగింది. గురువారం తనను అకారణంగా ఎందుకు తిట్టారని అడిగినందుకు తనపై బి.మంజుల, రవీందర్, నరేష్, విజయ్ కలిసి దాడి చేశారని గుగులోతు రాంబాబు ఫిర్యాదు చేశారు. ఇదే గొడవలో తనపై రాంబాబు, అతని తండ్రి బిచ్చు కలిసి దాడి చేశారని సేవ్యా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

- **భూ ఆక్రమణపై ఫిర్యాదు..**

భద్రాచలఅర్బన్: పట్టణంలోని చర్ల రోడ్డులో ఉన్న 9 సెంట్ల ఖాళీ స్థలంలో పట్టణానికి చెందిన కొందరు గుడిసెలు వేశారు. గుడిసెలు తొలగించాలని యజమానులు కోరినా ఆక్రమణదారులు తొలగించలేదు. దీంతో బాధితులు గురువారం ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసినట్లు సమాచారం.

గిరిజన యూనివర్సిటీని చర్లలోనే ఏర్పాటు చేయాలి


మాట్లాడుతున్న జీఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ

చర్ల: గిరిజన యూనివర్సిటీని చర్లలోనే ఏర్పాటు చేయాలని గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ డిమాండ్ చేశారు. గురువారం చర్లలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2010వ సంవత్సరంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గిరిజన యూనివర్సిటీ మంజూరు కాగా అప్పటి ప్రభుత్వ ఆదేశాలతో స్థానిక రెవెన్యూ అధికారులు చర్లలోని సర్వే నెంబర్ 117లో ఉన్న 250 ఎకరాల భూమిని గుర్తించి ప్రభుత్వానికి నివేదిక పంపించారని గుర్తుచేశారు. అనంతరం అప్పటి కేంద్ర మంత్రి బలరాం నాయక్ వర్సిటీ ములుగు జిల్లాలో ఏర్పాటు చేయాలని ఒత్తిడి తేవడంతో.. ఏర్పాటు ప్రక్రియ అర్ధంతరంగా నిలిచిపోయిందని పేర్కొన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఆ గిరిజన యూనివర్సిటీని చర్లలోనే ఏర్పాటు చేయించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జీఎస్‌పీ నాయకులు సోడి అశోక్, మడవి రవి, బొగ్గుల రాంచరణ్, కురసం రవి, గట్టుపల్లి గణేష్, ఉయిక తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

అఖిల్ మృతదేహానికి పోస్టుమార్టం పూర్తి

రెండు రోజుల్లో మధిర చేరుకునే అవకాశం


ఆస్పత్రిలో అఖిల్ శ్రావిక్ మృతదేహం

మధిర: ఉన్నత విద్య కోసం అమెరికా వెళ్లి తుపాకీ మిస్ ఫైర్ అయిన ఘటనలో మృత్యువాత పడిన మధిరకు చెందిన మహంకాళి అఖిల్ శ్రావిక్ (సాయి) మృతదేహానికి అక్కడ పోస్టుమార్టం పూర్తయింది. పట్టణానికి చెందిన మహంకాళి ఉమాశంకర్ – మాధవి దంపతుల పెద్ద కుమారుడు అఖిల్ 2021లో అమెరికా వెళ్లి ఎంఎస్ చేస్తూనే ఒక స్టోర్‌లో పార్ట్ టైం ఉద్యోగం చేస్తున్నారు. భారత కాలమానం ప్రకారం ఈనెల 6న ఉదయం 11 గంటల సమయాన తన స్నేహితుడు రవితేజతో కలిసి స్టోర్ సెక్యూరిటీ గార్డ్ గన్‌ను పరిశీలిస్తుండగా మిస్ ఫైర్ కావడంతో అఖిల్ తలకు తీవ్ర గాయమైంది. దీంతో ఆయనను ఆస్పత్రిలో చేర్పించగా.. చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం విదితమే. ఈమేరకు మృతదేహానికి గురువారం పోస్టుమార్టం పూర్తి చేసినట్లు కుటుంబ సభ్యులు సమాచారం అందింది. అనంతరం న్యూజెర్సీ వరకు అఖిల్ మృతదేహాన్ని అక్కడి పోలీసులు తరలించి, తానా ప్రతినిధులు, అఖిల్ స్నేహితులకు అప్పగించారు. ఇమిగ్రేషన్ తదితర ప్రక్రియలు పూర్తయ్యాక అఖిల్ మృతదేహం శనివారం కల్లా స్వస్థలానికి చేరుకునే అవకాశముందని అక్కడి తెలుగు విద్యార్థులు కుటుంబానికి సమాచారం ఇచ్చారు. కాగా, తొలుత అఖిల్ మృతదేహాన్ని ఆయన చదువుకుంటున్న యూనివర్సిటీకి తీసుకెళ్లాలని స్నేహితులు భావించినా, స్వస్థలానికి తరలింపులో మరింత జాప్యం జరుగుతుందని నిర్ణయాన్ని మార్చుకున్నట్లు పలువురు ‘సాక్షి’కి తెలిపారు.

యువతి అదృశ్యం.. ఆచూకీ లభ్యం

కారేపల్లి: పరీక్ష రాసేందుకు వెళ్లిన యువతి తిరిగి రాకపోవడంతో ఆమె బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేసి గాలిస్తుండగా, హైదరాబాద్ వెళ్లినట్లు ఆమె ఫోన్ చేయడంతో ఊపిరి పీల్చుకున్నారు. మండలంలోని కొత్తకమలాపురానికి చెందిన యువతి ఇల్లెందులో డిగ్రీ పరీక్షలు రాసేందుకు బుధవారం ఇంటి నుంచి వెళ్లింది. తిరిగి రాత్రి రాకపోవడంతో గురువారం ఉదయం యువతి బంధువులు కారేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంతలోనే ఆమె హైదరాబాద్‌లోని స్నేహితుల వద్దకు వెళ్లినట్లు కుటుంబీకులకు ఫోన్ చేయగా పోలీసులకు సమాచారం ఇచ్చారు.

నాలుగు ఉమ్మడి జిల్లాల్లో బైకు యాత్ర చేస్తా

భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



నల్లగొండ/ఇబ్రహీంపట్నం: దక్షిణ తెలంగాణలోని నాలుగు ఉమ్మడి జిల్లాల్లో తాను బైకు యాత్ర నిర్వహిస్తానని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పారు. ఈ నెల 13న పార్లమెంట్ సమావేశాలు ముగుస్తాయని, ఆ తరువాత యాత్ర ప్రారంభిస్తానని వెల్లడించారు. బైకు యాత్ర అయితే ఎక్కువ గ్రామాలు తిరిగేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. గురువారం ఆయన నల్లగొండలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఉమ్మడి నల్లగొండ, మహబూబ్‌గర్, ఖమ్మం, రంగారెడ్డి జిల్లాలో యాత్ర ఉంటుందని, ఈ విషయం అధిష్టానానికి కూడా చెప్పానని వివరించారు. ధరణి పోర్టల్‌తో ఎంతో మంది ఇబ్బందులు పడతున్నారని, రోజూ తహసీల్దార్, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని చెప్పారు. ప్రగతి భవన్‌పై రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కోమటిరెడ్డి స్పందిస్తూ.. ప్రగతి భవన్ ప్రజల సొత్తని, అది కేసీఆర్‌ది కాదని అన్నారు. గతంలో వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రజా దర్బారు పెట్టి రోజూ సామాన్య ప్రజలను కలసి వారి సమస్యలను పరిష్కరించారని చెప్పారు. ఆనాడు వైఎస్ రాజశేఖరరెడ్డి పేదల కోసం ఆరోగ్య శ్రీ, 104, 108 వంటి పథకాలను పెడితే తెలంగాణ ప్రభుత్వం వాటిని నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. 108, 104లో పనిచేసే ఉద్యోగులకు కూడా నెలల తరబడి వేతనాలు ఇవ్వడం లేదన్నారు. కాగా, హైదరాబాద్- విజయవాడ హైవే విస్తరణకు ప్రధాన మంత్రిని కలసి ఓకే చేయించానని వెంకట్‌రెడ్డి చెప్పారు. దీని కోసం రూ.1,600 కోట్లు మంజూరు చేయడానికి ఆయన అంగీకరించారని, త్వరలో పనులు ప్రారంభం అవుతాయని చెప్పారు.

ఓబీసీల్లో వీరశైవ లింగాయత్ సహా

24 ఉప కులాలు

చేర్చాలని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ వినతి

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రల్లోని వీరశైవ లింగాయత్ కులంతో పాటు 24 ఉపకులాలను కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చాలని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ కోరారు. వీరశైవ లింగాయత్, 24 ఉపకులాల ప్రతినిధులతో కలిసి గురువారం జాతీయ బీసీ కమిషన్ (ఎన్సీబీసీ) చైర్మన్ హన్స్‌రాజ్ గంగారాం అహిర్‌ను ఢిల్లీలో కలిసి వినతిపత్రం సమర్పించారు. వీర శైవ లింగాయత్ కులం, సంచారజాతులైన బుక్క అయ్యవారాస్, గోత్రాల, బొద్దిలి, ఆరె మరాఠి మరాఠ సహా మొత్తం 24 ఉప కులాలను ఓబీసీల్లోకి చేర్చాలని విజ్ఞప్తి చేశారు.

రైతులకు మేలు చేసేందుకే ధరణి

- శాసనసభలో మంత్రి వేముల
- 13 లక్షల ఫిర్యాదులొస్తే 12 లక్షలు పరిష్కారం
- రెండేళ్ళలో 24 లక్షల లావాదేవీలు



సాక్షి, హైదరాబాద్: వివాదాల్లేకుండా, భూ రికార్డులను భద్రపర్చి రైతులకు మేలు చేసేందుకే ధరణి పోర్టల్ తీసుకొచ్చామని శాసనసభా వ్యవహారాల మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. ధరణిలో భూమి నమోదు కాలేదని ఇప్పటివరకూ 13 లక్షల ఫిర్యాదులొస్తే 12 లక్షలు పరిష్కరించినట్టు చెప్పారు. రైతుకు తన భూమిపై పూర్తి హక్కు కల్పించే ధరణిని విపక్షాలు అడ్డుకోవడం విడ్డూరమన్నారు. గురువారం శాసనసభలో పలు పద్దులపై చర్చకు మంత్రి సమాధానమిచ్చారు.

పైరవీకారుల రాజ్యాన్ని తెచ్చేందుకే..

రైతులను పీడించే పైరవీకారుల రాజ్యాన్ని మళ్ళీ తెచ్చేందుకే కాంగ్రెస్ పార్టీ ధరణిని వ్యతిరేకిస్తోందని ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. సాదా బైనామా ద్వారా భూమి రికార్డుల్లోకి ఎక్కించేందుకు 2016లోనే కాకుండా 2020లోనూ అవకాశం కల్పించామని, ఈ దశలోనే కోర్టు కేసు వల్ల ఇది ఆగిపోయిందన్నారు. ఈ రెండేళ్లలో ధరణి ద్వారా 24 లక్షల లావాదేవీలు జరిగాయని, కేవలం 15 నిమిషాల్లోనే లావాదేవీ పూర్తవుతోందని తెలిపారు. ధరణిలో 33 మాడ్యూల్స్ ఇవ్వడం వల్ల, ప్రతి గ్రామంలోనూ సమస్య పరిష్కారం దిశగా కృషి చేయడం వల్ల సమస్యలు తగ్గుతున్నాయని చెప్పారు.

58, 92 జీవోల ద్వారా క్రమబద్ధీకరణ

125 గజాలున్న 1.25 లక్షల మంది పేదలకు 58 జీవో ద్వారా ఇళ్ళ జాగాలను క్రమబద్ధీకరించామని, ఇళ్ళు కట్టుకున్న 36 వేల మంది పేదలకు 59 జీవో ద్వారా క్రమబద్ధీకరణ చేశామని ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్ ఎల్‌బీ నగర్‌లో భవంతులు ఉన్న 44 కాలనీల్లో రెగ్యులైజేషన్ చేపట్టి, యజమానుల్లో ఆందోళన తగ్గించామని చెప్పారు. 2.92 లక్షల మందికి డబుల్ బెడ్రూ ఇళ్లు ఇవ్వాలన్నది ప్రభుత్వ లక్ష్యమని, ఇందులో 1.38 లక్షలు పూర్తి చేశామని, మరో 45 వేలు 90 శాతం పూర్తయ్యాయని, 35 వేలు వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. ఈ పథకానికి రూ. 11,639 కోట్లు ఖర్చవుతుంటే కేంద్రం ఇచ్చింది కేవలం రూ.1,311 కోట్లు మాత్రమేనన్నారు.

వక్ఫ్ భూములు పరిరక్షిస్తాం

ఆదాయంలో రిజిస్ట్రేషన్ల శాఖ 3వ స్థానంలో ఉందని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. వక్ఫ్ భూముల పరిరక్షణకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఇందుకు సంబంధించిన న్యాయపరమైన చర్యలు చేపట్టిందని చెప్పారు. ప్రతి గ్రామంలోనూ రోడ్ల మరమ్మతు పనులు చేస్తున్నామని, గ్రామం నుంచి మండలానికి బీటీ రోడ్డు, మండలం నుంచి జిల్లాకు డబుల్ రోడ్డు ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఆయన చెప్పారు.

'మండలి' డిప్యూటీ చైర్మన్‌గా బండా ప్రకాశ్!

- ఏడాదిన్నర తర్వాత శాసన మండలికి డిప్యూటీ చైర్మన్
- నేడు నోటిఫికేషన్, 11న నామినేషన్, 12న ఎన్నిక
- అదే రోజు కొత్త డిప్యూటీ చైర్మన్ బాధ్యతల స్వీకరణ
- త్వరలో మండలి చీఫ్ విప్, విప్‌ల నియామకం?



సాక్షి, హైదరాబాద్: సుమారు ఏడాదిన్నరగా ఖాళీగా ఉన్న శాసన మండలి డిప్యూటీ చైర్మన్ ఎన్నికకు రంగం సిద్ధమైంది. ఈ ఎన్నికకు సంబంధించి శుక్రవారం నోటిఫికేషన్ వెలువడనుండగా, 11వ తేదీన నామినేషన్ల స్వీకరణ, పరిశీలన తదితరాలు పూర్తి చేస్తారు. 12న ఉదయం 10 గంటలకు శాసన మండలి ప్రారంభమైన అనంతరం డిప్యూటీ చైర్మన్ ఎన్నిక ప్రక్రియను పూర్తి చేసి బాధ్యతలు అప్పగిస్తారు. కాగా శాసన మండలి డిప్యూటీ చైర్మన్‌గా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ బండా ప్రకాశ్ ముదిరాజ్ ఎన్నిక దాదాపు ఖాయమైంది. ఆయన పేరును బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఖరారు చేశారు. దీంతో ఈ నెల 11న శాసన మండలి డిప్యూటీ చైర్మన్ ఎన్నికకు సంబంధించి నామినేషన్ పత్రాలు దాఖలు చేసేందుకు బండా ప్రకాశ్ ఏర్పాట్లు చేసుకుంటున్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం నుంచి శాసన మండలి డిప్యూటీ చైర్మన్‌గా వ్యవహరించిన నేతి విద్యాసాగర్ 2021 జూన్ 3న ఎమ్మెల్సీగా తన పదవీ కాలం పూర్తి చేసుకున్నారు. అప్పటి నుంచి శాసన మండలి డిప్యూటీ చైర్మన్ పదవికి ఎన్నిక జరగకపోవడంతో సుమారు ఏడాదిన్నరగా ఖాళీగా ఉంది. ఇదిలా ఉంటే 2018 మార్చిలో బీఆర్ఎస్ తరఫున రాజ్యసభకు ఎన్నికైన బండా ప్రకాశ్ ఎంపీగా ఆరేళ్ల పదవీ కాలం పూర్తి చేయకుండానే 2021 నవంబర్‌లో ఎమ్మెల్యే కోటాలో శాసన మండలికి ఎన్నికయ్యారు. అనంతరం 2021 డిసెంబర్ మొదటి వారంలో బండా ప్రకాశ్ తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఇదిలా ఉంటే ప్రస్తుతం శాసన మండలిలో డిప్యూటీ చైర్మన్‌తో పాటు ప్రభుత్వ చీఫ్‌విప్, మరో రెండు విప్ పదవులు కూడా ఖాళీగా ఉన్నాయి. స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎంఎస్ ప్రభాకర్ ఒక్కరే ప్రస్తుతం మండలిలో ప్రభుత్వ విప్‌గా వ్యవహరిస్తున్నారు. డిప్యూటీ చైర్మన్ ఎన్నిక ముగిశాక మండలి చీఫ్ విప్, విప్ పదవుల భర్తీ జరుగుతుందని బీఆర్ఎస్ వర్గాలు చెప్తున్నాయి.

50 సీట్లలో పోటీపై సరైన సమయంలో నిర్ణయం

- ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ
- అసెంబ్లీలో కేటీఆర్‌తో భేటీ
- తాజ్‌మహల్ కంటే అందంగా తెలంగాణ సెక్రటేరియట్ ఉందంటూ ప్రశంస



సాక్షి, హైదరాబాద్: వచ్చే శాసనసభ ఎన్నికల్లో తెలంగాణలో 50 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేసే అంశంపై సరైన సమయంలో నిర్ణయం తీసుకుంటామని ఏఐఎంఐఎం అధినేత, లోక్‌సభ సభ్యులు అసదుద్దీన్ ఒవైసీ వెల్లడించారు. ఎన్నికలకు చాలా సమ యం ఉందని అంటూనే అక్టోబర్ నాటికి నిర్ణయం తీసుకుంటామనే అభిప్రాయం వ్యక్తం చేశారు. రాష్ట్ర అసెంబ్లీ వార్షిక బడ్జెట్ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో అసదుద్దీన్ ఒవైసీ గురువారం రాత్రి అసెంబ్లీకి వచ్చారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావుతో భేటీ అనంతరం మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్ చేశారు. కేసీఆర్ జాతీయ రాజకీయాల్లోకి రావడం మంచి పరిణామమని పేర్కొంటూ, తెలంగాణలో బీఆర్ఎస్ పాలన బాగుందని కితాబునిచ్చారు. బీఆర్ఎస్ దేశవ్యాప్తంగా విస్తరించి జాతీయ రాజకీయాల్లోకి రావడం మంచిదేనని అసదుద్దీన్ అన్నారు. ఎంఐఎం పార్టీ బీజేపీకి బీ టీమ్ అంటూ కాంగ్రెస్ నేతలు ప్రచారం చేస్తున్నారని, తాము ఎవరికీ బీ టీమ్ కాదన్నారు. బీజేపీని ఓడించాల్సిన అవసరముందన్నారు. అదానీ అంశంపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేయాలనే డిమాండ్‌కు ప్రధాని మోదీ ఒప్పుకోవడం లేదని చెప్పారు. తాజ్‌మహల్ కంటే అందంగా తెలంగాణ కొత్త సచివాలయాన్ని కేసీఆర్ ప్రభుత్వం నిర్మించిందని ప్రశంసించారు. ఈ నెల 17న జరిగే సచివాలయం ప్రారంభోత్సవం అధికారిక కార్యక్రమం అయినందున తాము కూడా వెళ్తామన్నారు. అయితే సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో జరిగే బహిరంగ సభతో తమ పార్టీకి సంబంధం లేదన్నారు. పరేడ్ మైదానంలో జరిగే బహిరంగ సభకు ఇతర పార్టీలను ఆహ్వానించడం బీఆర్ఎస్‌కు సంబంధించిన విషయమని ఎంపీ అసదుద్దీన్ వ్యాఖ్యానించారు. మండలి స్థానిక సంస్థల కోటా ఎన్నికలో తమ పార్టీ అభ్యర్థికి బీఆర్ఎస్ మద్దతు కోరేందుకు సమయముందని, కేటీఆర్‌తో భేటీలో ఈ అంశం ప్రస్తావనకు రాలేదని చెప్పారు.

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ షెడ్యూల్‌పై చర్చ

మండలి స్థానిక సంస్థల కోటాలో హైదరాబాద్ నుంచి ఎన్నికైన ఎంఐఎం ఎమ్మెల్సీ సయ్యద్ అమీనుల్ హసన్ జాఫ్రీ పదవీకాలం మేలో ముగియనుంది. ఖాళీగా ఉన్న స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ స్థానం ఎన్నికకు షెడ్యూల్ ప్రకటన నేపథ్యంలో మంత్రి కేటీఆర్‌తో అసద్ భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రస్తుతం మండలిలో ఎంఐఎంకు ఇద్దరు సభ్యులుండగా, రెండు స్థానాలూ గతంలో బీఆర్ఎస్ మద్దతుతోనే సాధించింది. ప్రస్తుతం జీహెచ్ఎంసీలో బీఆర్ఎస్ సంఖ్యాపరంగా అతిపెద్ద పార్టీ కావడంతో మళ్లీ ఈ స్థానాన్ని తమకు కేటాయించాలని కోరేందుకు ఆయన అసెంబ్లీకి వచ్చినట్లు సమాచారం. కాగా స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ స్థానంలో ఎంఐఎంకు మద్దతుకు సంబంధించి బీఆర్ఎస్ ఒకట్రెండు రోజుల్లో వైఖరి వెల్లడించే అవకాశమున్నట్లు తెలిసింది.

తెలంగాణ బడ్జెట్ సమావేశాలు 2023-24

'రైతులు క్వింటాలుకు 8 కిలోలు నష్టపోతున్నారు'



సాక్షి, హైదరాబాద్: కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యం విక్రయిస్తున్నప్పటికీ, మిల్లర్ల పెత్తనంతో క్వింటాలుకు 7–8 కిలోల ధాన్యాన్ని నష్టపోతున్నారని మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆందోళన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతు ధాన్యం విక్రయించగానే వాహనాలకు ట్రిప్ షీట్ ఇవ్వకపోవడంతో మిల్లర్లు రైతులను పిలిపించి సాకులు చూపుతూ క్వింటాలుపై 8 కిలోల వరకు ధాన్యాన్ని అదనంగా తీసుకుంటున్నారన్నారు. అసెంబ్లీలో గురువారం పద్దులపై చర్చ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పౌరసరఫరాల సంస్థ నుంచి తీసుకునే బియ్యానికి డబ్బులు చెల్లించకపోవడంతో రూ. 20వేల కోట్లు బకాయిలుగా పేరుకుపోయాయని, వాటిని వెంటనే చెల్లించాలన్నారు. రేషన్ కార్డుల జారీని ఎన్నికలకే పరిమితం చేయకుండా అర్హులకు కుటుంబాలకు అందజేయాలని కోరారు. ఎక్సైజ్ ఆదాయం కోసం బెల్టు షాపులను ప్రోత్సహిస్తున్నారని, వెంటనే వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

వక్ఫ్‌భూములు ఎవరి జాగీర్లు కావు

- భూ చట్టాల పేరిట ముస్లింలకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దాలి
- బీసీలకు కేటాయించిన బడ్జెట్ ఖర్చు చేయడంలో అన్యాయం
- ఎంఐఎం పక్షనేత అక్బరుద్దీన్ ఒవైసీ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని వక్ఫ్ భూములు ఎవరివో తెలియని పరిస్థితి నెలకొందని ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ ఆందోళన వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పటి నుంచి భూ చట్టాల పేరిట ముస్లింలు భూములు కోల్పోయారని, ఇనాం భూములు, జాగీర్ భూములు పోయి పేదలుగా మారారని, వారికి జరిగిన అన్యాయాన్ని సవరించాలని కోరారు. వక్ఫ్ భూముల పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. అసెంబ్లీలో బడ్జెట్ పద్దులపై జరిగిన చర్చ సందర్భంగా అక్బరుద్దీన్ మాట్లాడుతూ వక్ఫ్ భూములెవరి జాగీర్లు కావని, దేవుడి ఆస్తి అని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలోని వక్ఫ్‌భూములను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టారని ఆరోపించారు. ప్రస్తుతం వక్ఫ్‌భూముల్లో రూ.100, రూ 200తో అద్దెలకు ఉంటున్న వారు ఆ అద్దెలను కూడా చెల్లించడం లేదని, సంవత్సరాలుగా తిష్టవేశారన్నారు. వక్ఫ్, దేవాదాయ శాఖ పరిధిలో ఉన్న కొన్ని భూముల పత్రాలు పర్షియన్ భాషలోఉన్నాయని, వాటిని ట్రాన్స్‌లేట్ చేయించాలని కోరారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్, ఉన్నత విద్యా కమిటీలలో ముస్లింలకు ప్రాతినిధ్యం కల్పించాలని అక్బరుద్దీన్ కోరారు. బీసీల సంక్షేమం విషయంలో ప్రభుత్వం పట్ల అసంతృప్తి నెలకొందని, గత ఏడాది బడ్జెట్‌లో రూ.6వేల కోట్లు కేటాయిస్తే కేవలం రూ.417 కోట్లు మాత్రమే ఖర్చు చేశారన్నారు. 2014 నుంచి 2023 వరకు బీసీల సంక్షేమానికి అయిన ఖర్చు అసంతృప్తిని మిగిల్చిందని, ఈసారి బీసీలకు బడ్జెట్ కేటాయింపులకు అనుగుణంగా నిధులు విడుదల చేయాలని కోరారు. దళితబంధు తరహాలో బీసీబంధు చేపట్టాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో సంక్షేమ పథకాలు భేష్

రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో చేసిన కేటాయింపుల పట్ల పూర్తి సంతృప్తి వ్యక్తం చేసిన అక్బరుద్దీన్ ఒవైసీ... రాష్ట్రంలో జరుగుతున్న సంక్షేమ పథకాలను కొనియాడారు. ఏ రాష్ట్రంలో లేనివిధంగా ముస్లిం మైనారిటీల సంక్షేమానికి కేసీఆర్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఉర్దూను రెండో అధికారిక భాషగా ప్రకటించిన రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. ముస్లింలకు ప్రతినిధిగా వ్యవహరిస్తున్నప్పటికీ తాను హిందూ, క్రిస్టియన్, సిక్కులు తదితర అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం పనిచేస్తున్నట్లు అక్బరుద్దీన్ చెప్పారు.

ఆయిల్‌పామ్ సాగుకు అంతా అనుకూలం



సదస్సులో మాట్లాడుతున్న మరియన్న

దమ్మపేట: రాష్ట్రంలోనే అశ్వారావుపేట, దమ్మపేట మండలాలు ఆయిల్‌పామ్ సాగుకు అత్యంత అనుకూలంగా ఉన్నాయని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉద్యాన శాఖ అధికారి జినుగు మరియన్న తెలిపారు. మండలంలోని పట్వారిగూడెంలో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు గురువారం ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోనే దమ్మపేట, అశ్వారావుపేట మండలాలు ఆయిల్‌పామ్ హబ్‌గా ఉన్నాయని తెలిపారు. ఇక్కడి నేలలు సాగుకు అనుకూలంగా ఉన్నందున మరింత మంది రైతులు ముందుకు రావాలని కోరారు. ఏడీఏ అఫ్జల్‌బేగం మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్‌లో అంతర పంటలుగా కూరగాయలు సాగు చేయడంతో పాటు రసాయన ఎరువులకు బదులుగా సేంద్రియ ఎరువులను వాడాలని సూచించారు. జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ సోయం ప్రసాద్, ఆయిల్ పామ్ డివిజనల్ మేనేజర్ బాలకృష్ణతో పాటు కొయ్యల అచ్యుతరావు, చంద్రశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం



భద్రాచలం: వచ్చే విద్యా సంవత్సరం గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 6, 7, 8వ తరగతుల్లో ఖాళీ అయ్యే సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు తెలిపారు. అలాగే, ఖమ్మం జిల్లాలోని స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్, ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల (బాలురు)ల్లో ఎనిమిదో తరగతిలో ప్రవేశాలు ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు మార్చి 7వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే ఏప్రిల్ 16న ఎంపిక చేసిన కేంద్రాల్లో పరీక్ష నిర్వహించి ప్రవేశాలు కల్పిస్తామని తెలిపారు. ఇక ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతి(ఇంగ్లిష్ మీడియం)లో ప్రవేశానికి గిరిజన బాలబాలికలు ఆన్‌లైన్‌లో మార్చి 6వ తేదీలోగా రూ.100 చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చని పీఓ పేర్కొన్నారు. ప్రస్తుతం నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని తెలిపారు.

నెరవేరిన సెర్ప్ ఉద్యోగుల కల

- ఫలించిన 23 ఏళ్ల పే స్కేల్‌పోరాటం
- ఉమ్మడి జిల్లాలో 342 మందికి లబ్ధి



జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖలో విధులు నిర్వర్తిస్తున్న సెర్ప్ ఉద్యోగులు

ఖమ్మంమయూరిసెంటర్: గ్రామీణ ప్రాంతాల్లోని మహిళల అభివృద్ధి, సాధికారతే లక్ష్యంగా పని చేస్తున్న సెర్ప్ ఉద్యోగుల కల సాకారమైంది. ఏళ్లుగా ఎదురుచూస్తున్న సెర్ప్ ఉద్యోగులకు పే స్కేల్ అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అంతేకాక ఈ ఏడాది బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తున్నట్లు చెప్పడంతో పాటు ఏప్రిల్ నుంచే పెంచిన వేతనాలు అమలులోకి వస్తాయని వెల్లడించింది. దీంతో ఉద్యోగుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

మహిళకు అండగా...

గ్రామీణ ప్రాంత మహిళల కోసం రాష్ట్ర ప్రభుత్వం బ్యాంకుల ద్వారా లింకేజీ రుణాలు మంజూరు చేస్తోంది. ఈ రుణాల మంజూరు సాఫీగా సాగడంతో పాటు మహిళాసంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకునేలా చూడడంలో సెర్ప్ ఉద్యోగులు కీలకంగా వ్యవహరిస్తున్నారు. కోవిడ్ సమయంలోనూ సెర్ప్ సిబ్బంది మహిళా సాధికారత కోసం పనిచేశారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టే అనేక పథకాలు గ్రామీణులకు అందించేందుకు వారి సేవలు ఉపయోగించుకుంటున్నారు. ఈ నేపథ్యాన వారు పే స్కేల్‌తో పాటు హెల్త్ స్కీమ్ కోసం పోరాడుతుండగా ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది.

ఫలించిన పోరాటం..

సెర్ప్ ఉద్యోగులకు పే స్కేల్ అమలు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు ఇవ్వడమే కాక హెల్త్ స్కీమ్ అమలు చేయాలని సెర్ప్ ఉద్యోగుల సంఘాలు రెండు దశాబ్దాల నుంచి పోరాటం చేస్తున్నాయి. ఇరవై ఏళ్ల క్రితం వెలుగు పేరుతో ఏర్పాటైన ఈ సంఘం ఆ తర్వాత ఐకేపీగా రూపాంతరం చెంది ప్రస్తుతం సెర్ప్‌గా కొనసాగుతోంది. ఈమేరకు 23 ఏళ్లకు వారి పోరాటాన్ని, సేవలను గుర్తించిన ప్రభుత్వం పే స్కేల్ ఇచ్చేందుకు అంగీకరించింది. గతంలోనే ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినా ఆచరణలో సాధ్యం కాలేదు. ఈ ఏడాది బడ్జెట్‌లో హామీ అమలుకు నిధులు కూడా కేటాయించారు. సెర్ప్‌లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 342 మంది విధులు నిర్వర్తిస్తుండగా, ఖమ్మం జిల్లాలో 179 మంది, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 163 మంది ఉద్యోగులు, సిబ్బంది ఉన్నారు. వీరిలో ఏపీడీ, డీపీఎంలు, ఏపీఎంలు, సీసీలు, మినిస్టీరియల్ ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు.

ఎంతో అభివృద్ధి చేశా.. ఇంకా చేస్తా!

- మళ్లీ సేవ చేసే అవకాశం రావాలని కోరుకుంటున్నా...
- మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

నేలకొండపల్లి: మరో నాలుగేళ్లలో పాలేరు నియోజకవర్గం మాదిరి ఎక్కడా లేనంతగా అభివృద్ధి చెందుతుందని మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలోని వసుంధర కాలేజీలో వార్షికోత్సవం గురువారం జరగగా ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ, ఇంటర్ కాలేజీలకు పక్కా భవనాలు మంజూరు చేయడంతో పాటు రామదాసు మందిరాన్ని రూ.4 కోట్లతో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. పాలేరు పాత కాలువను రూ.70 కోట్లతో పూర్తి చేయడమే కాక ప్రతీ గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించిన తాను సీతారామ ప్రాజెక్టుకు కూడా పూర్తిచేసి గోదావరి జలాలను పాలేరుకు తీసుకొస్తానని చెప్పారు. రాష్ట్రంలోనే ఎక్కువ శాతం నీటి పారుదల సౌకర్యం కలిగిన నియోజకవర్గం పాలేరు కావడంతో రానున్న నాలుగేళ్లలో గణనీయమైన అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. ఆనాడు ప్రజలకు ఇచ్చిన మాట కోసం పెద్ద పాలేరుగా పనిచేయగా, ప్రజలకు మళ్లీ సేవ చేసే అవకాశం ఇవ్వాలని భగవంతుడిని కోరకుంటున్నానని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి జిల్లా కన్వీనర్ నల్లమల్ల వెంకటేశ్వరరావు, జిల్లా ఇంటర్ విద్యాధికారి కె.రవిబాబు, ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ కె.రాజేష్, కళాశాల కరస్పాండెంట్ ఈగ అనిల్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు సాధు రమేష్‌రెడ్డి, శాఖమూరి రమేష్, వెన్నపూసల సీతారాములు, కాసాని నాగేశ్వరరావు, గుడిపాటి ముక్కంటి, కొమ్మూరి నరేష్, కడియాల శ్రీనివాస రావు, మైసా శంకర్, కడియాల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

24న దేవాదాయ శాఖ ఉద్యోగ, అర్చక సంఘం ఎన్నికలు

ఖమ్మంగాంధీచౌక్: దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఉద్యోగులు, అర్చకుల జిల్లా సంఘాల ఎన్నిక ఈనెల 24న నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా ఉద్యోగులు, అర్చకుల సంఘాల అధ్యక్షులు తోటకూర వెంకటేశ్వర్లు, దాములూరి వీరభద్రరావు తెలిపారు. ఖమ్మం శ్రీ స్తంభాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఎన్నికలు జరుగుతాయని పేర్కొన్నారు. కాగా, ఇప్పటివరకు ఉమ్మడి జిల్లా స్థాయిలో కొనసాగుతున్న కమిటీలను ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు వేర్వేరుగా ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో పోటీకి ఆసక్తి ఉన్న వారు ఈనెల 20వ తేదీ నాటికి నామినేషన్లను దాఖలు చేయాలని సూచించారు. ఖమ్మం జిల్లా కమిటీలకు ఎన్నికల అధికారిగా స్తంభాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఈఓ కొత్తూరు జగన్మోహన్‌రావు, భద్రాద్రి జిల్లా ఎన్నికల అధికారిగా కాల్వొడ్డు ఆంజనేయస్వామి ఆలయ ఈఓ వీ.వీ.నర్సింహారావు వ్యవహరిస్తారని తెలిపారు.

భవిష్యత్ అవసరాల మేరకు కొత్త గనులు

మణుగూరు ఏరియాలో పర్యటించిన సింగరేణి డైరెక్టర్లు



అధికారులతో సమీక్షలో మాట్లాడుతున్న సింగరేణి డైరెక్టర్లు

మణుగూరుటౌన్: భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని మణుగూరు ఏరియాలో కొత్త గనుల ఏర్పాటుపై నిర్దిష్టమైన ప్రణాళికలు రూపొందించాలని సింగరేణి డైరెక్టర్ ఎన్.బలరామ్ సూచించారు. డైరెక్టర్లు ఎస్‌వీకే.శ్రీనివాస్, జి.వెంకటేశ్వర రెడ్డి, జీఎం(సీపీఅండ్‌పీ) కార్పొరేట్ సీహెచ్.నర్సింహారావుతో కలిసి ఆయన మణుగూరు ఏరియాలో గురువారం పర్యటించారు. తొలుత కొండాపురం భూగర్భ గని, ఇతర ఓపెన్‌కాస్టు గనులను సందర్శించి ఏరియా ఉత్పత్తి ఉత్పాదకతపై జీఎం దుర్గం రాంచందర్‌తో చర్చించారు. అతర్వాత జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్షలో డైరెక్టర్లు మాట్లాడుతూ.. మణుగూరు ఏరియాకు బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతలో మంచి పేరు ఉన్నందున అదే ఒరవడి కొనసాగించాలని సూచించారు. ఈఏడాది లక్ష్యం మేరకు 116లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తిని అధిగమించి, రానున్న ఏడాదికి ఇప్పుడే లక్ష్యాలను నిర్దేశించుకోవాలని తెలిపారు. కార్మికుల సంక్షేమంపై యాజమాన్యం ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పారు. దేశవ్యాప్తంగా విద్యుత్ సంస్థలకు బొగ్గు కొరత ఏర్పడిన నేపథ్యాన ఆయా సంస్థలకు బొగ్గు సరఫరా చేస్తూనే ఇతర పరిశ్రమలకు ఏకకాలంలో బొగ్గు అందించాల్సిన అవసరముందని చెప్పారు. ఇక పీకేఓసీ–2 నుంచి రోజుకు 42వేల టన్నుల నుంచి 45వేల టన్నుల మేర రవాణా చేయాలని డైరెక్టర్లు ఆదేశించారు. ఈకార్యక్రమంలో సింగరేణి అధికారులు డి.లలిత్‌కుమార్, జి.నాగేశ్వరరావు, డి.వెంకటేశ్వర్లు, నర్సిరెడ్డి, లక్ష్మీపతిగౌడ్, శ్రీనివాసాచారి, ఎస్.రమేష్, వెంకట్రావు, సురేష్ పాల్గొన్నారు.

ఇల్లెందులో 'భూగర్భ' డైరెక్టర్ పర్యటన



భూగర్భ జలాలను పరీక్షిస్తున్న అధికారులు

ఇల్లెందు: సింగరేణి పరిధిలోని ఇల్లెందు ఏరియా జేకే ఓసీ విస్తరణలో భాగంగా భూగర్భ జలాల పరిశీలన నిమిత్తం భూగర్భ జలాల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ పండిత్ మధునూరె, డిప్యూటీ డైరెక్టర్ జ్యోతికుమార్, అసిస్టెంట్ డైరెక్టర్లు రమేష్, బాలూనాయక్ గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా జేకే ఓసీ పరిధిలో భూగర్భ జలమట్టం, ఇతర వివరాలను ఆరా తీశారు. ఏరియా జీఎం షాలేము రాజు మాట్లాడుతూ.. భూగర్భ జలాల క్లియర్ సర్టిఫికెట్ ఇచ్చేందుకు గాను అధికారులు పర్యటించారని తెలిపారు. భూగర్భ జలాల అభివృద్ధి కోసం నిర్మించిన చెక్‌డ్యాంలు, హార్వెస్టర్ పిట్లు, బోర్లను తనిఖీ చేశారని పేర్కొన్నారు. అధికారులు మల్లారపు మల్లయ్య, రాజ్‌కుమార్, నామ కుమార్, ధనుంజరెడ్డి, పులి పూర్ణచందర్‌రావు, చిన్నయ్య, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు రవాణాకు అంతరాయం ఏర్పడొద్దు



ఓసీలో వ్యూ పాయింట్ వద్ద చర్చిస్తున్న అధికారులు

సత్తుపల్లిరూరల్: సింగరేణి పరిధి సత్తుపల్లి మండలంలోని జేవీఆర్ ఓసీ, ఈపీసీ, సీహెచ్‌పీ, సైలో బంకర్, కోల్ రిసీవింగ్ సెంటర్లను ఆల్విన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సూర్యనారాయణ గురువారం పరిశీలించారు. జీఎంలు స్వామినాయుడు, జక్కం రమేష్, ఎస్ఓఎం సుందరరాజుతో కలిసి పర్యటించిన ఆయన బొగ్గు రవాణా విషయంతో అంతరాయం ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సీహెచ్‌పీ యాజమాన్యాన్ని ఆదేశించారు. రానున్న రెండు నెలలు లక్ష్యసాధనలో కీలకమైనందున అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఏ రోజు ఉత్పత్తి అయిన బొగ్గును అదే రోజు రవాణా చేయాలని, రోజూ కనీసం 10 రేకుల బొగ్గు రవాణాకు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం సూర్యనారాయణ, పి.నర్సింహారావు, కేశవరావు, మధుసూదన్ పాల్గొన్నారు.